# బేతాళ ప్రశ్న

రామోజీగుడా, లక్ష్మోజీగుడా నేషనల్ హైవేకి చెరొకవైపు వున్న రెండు గ్రామాలు.

రెండు పంచాయతీ ఆఫీసులూ ఒకదానికొకటి కనుచూపుమేరలో వుంటాయి. ఉనికిలోను, పేరులోను, వున్న సామీప్యం పాలకవర్గాల మధ్య లేదు. ఇద్దరు గ్రామాధ్యక్షులూ రెండు విభిన్న పార్టీలకు చెందినవాళ్ళు.

స్పర్థలూ, వైషమ్యాలతో పచ్చగడ్డి వేస్తే భగ్గున మండే వాతావరణం. ఈ పాలకులు జరిపే కార్యక్రమాలు అందరికీ తెలిసినంతవరకు రెండే.

పంద్రా ఆగస్టునాడూ, చబ్బీస్ జన్వరి రోజునా జెండా ఎగరవెయ్యడం. మిగతా రోజుల్లో వారి వారి బలాలు స్థిరపరచుకోవడం ప్రదర్శించుకోవడంతోనే సరిపోతుంది.

ఒక పంద్రా ఆగస్టు రోజు రామోజీగుడా పంచాయతీ ఆఫీసు ముందు జెండా వందన సమయంలో నేనక్కడ నిలబడి వున్నాను. గ్రామాధ్యక్షుడు జెండా ఎగరవేశాక 'జనగణమన...' పాడుతున్నారు.

నాకు దగ్గరలోనే సుమారు ఏడేళ్ళ కుర్రవాడు వాడి నాయనతో నసుగు తున్నాడు. "నాయనా-ఉల్టా చేసిన్రు. మా ఇస్కూల్ల ఇట్ల జెయ్యరు" అంటున్నాడు.

వినే సహనం లేని వాడి నాయన "ఊకో-మిఠాయి జెర్ర సేపయి నాక, ఇప్పడియ్యరు" అని కసురు కుంటున్నాడు. ఆ కుర్రవాడి మాటలకు నాకేదో స్ఫురించి ఎగురుతున్న జెండా చూశాను.

ఆకుపచ్చ రంగు మీదకు పోయి ఉల్టాగా ఎగురుతోంది. అప్రయత్నంగా లక్ష్మీజీగుడా ఆఫీసువేపు చూశాను. ఆ జెండా సవ్యంగా ఎగురుతోంది.

కిందటి సాయంత్రం వానవల్ల ఒకటి రెండు పరుగు పందాలు ఆగిపోయాయి అవి జరిపి, తర్వాత బహుమతులూ, స్వీట్లు పిల్లలకు పంచే ప్రయత్నం జరుగుతోంది. ఆ హడావుడిలో పడ్డ కుర్రాడు వాడి మనసులోని సమస్యను మరిచాడు. ఎగురుతున్న పతాకాన్ని సవరించాలంటే క్రిందకు దించి మళ్ళా ఎగురవేయక తప్పదు. ప్రత్యర్థుల దృష్టి నాకర్షించక తప్పదు. పత్రికలో ప్రముఖంగా ఈ వార్త చోటు చేసుకోక తప్పదు ఆ అప్రతిష్టను రామోజీగుడా పాలకులు సహించలేని పరిస్థితి.

ఆ కారణంగా తప్పు ఎలా జరిగినా ఎత్తి చూపించినవాడి మీద కోపం మళ్ళక తప్పదు. ఇలా సతమతమై ఊరకున్నాను

ఆశ్చర్యమేమిటంటే ఆ విషయం ఆ చిన్న కుర్రవాడికీ, వాడి సణుగుడు వల్ల నాకూ తప్ప ఇంకో వ్యక్తికి పట్టకుండా జెండా హాయిగా ఎగిరింది. ఒక పరుగు పందెంలో ఆ చిన్న వెధవాయ్ మూడవ స్థానంలో వచ్చాడు. వాళ్ళు రెండే బహుమతులు ప్రకటించారు. నేను కలగజేసుకొని నా తరుఫున ఒక ప్రత్యేక బహుమతిని ప్రకటించేటట్లు

అక్కడి పెద్దలతో ఒప్పించాను. ఆ పిల్లవాడి మొహం ఆనందంతో వికసించింది.

ఆ రాత్రి నిద్రించే వేళ ఒక వింత ప్రశ్న మనసులో రేగి నన్ను నిలదీసింది. "ప్రత్యేక బహుమతి కుర్రవాడి పరుగులో ప్రతిభకా? లేక వాడి పరిశీలన శక్తికా?" అన్నదే ఆ ప్రశ్న.

"ఆ రెండింటికీ మించిన (నాలో లేని) గుణ విశేషానికి" అని జవాబు చెప్పుకున్నాను.

ఎదురుగా కనిపిస్తున్న అవలక్షణాన్ని చూస్తూ నోరైనా మెదప లేని పిరికితనం నాది. చూసిన పొరపాటును పైకి అనకుండా వుండ లేని నిజాయితీ వాడిది. మనస్సెందుకో తేలికపడింది. నిద్ర నన్ను జయించింది.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక 30-9-88)